క్లుప్తంగా

నేడు టీ-12 క్రికెట్ టోర్నీ ఫైనల్స్

యానాం: యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీ-12 క్రికెట్ టోర్నీ ఫైనల్స్ ఆదివారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో జరగనుందని అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్‌బాబు శనివారం తెలిపారు. శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో భాగంగా మొదటి మ్యాచ్ సీ సోల్జర్స్, అగ్ని లయన్స్ మధ్య జరగగా అగ్ని లయన్స్ విజయం సాధించిందని, కేఎఫ్‌సీసీ, కేవీఆర్ జట్ల మధ్య మ్యాచ్‌లో కేవీఆర్ జట్టు విజయం సాధించిందన్నారు. ఈ నేపథ్యంలో అగ్నిలయన్స్, కేవీఆర్ జట్ల మధ్య జరిగే ఫైనల్స్‌కు ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగంలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



మెడీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: సమాజంలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు తమ వంతు పాత్ర వహించాలని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక విష్ణాలయం వీధిలో నూతనంగా నెలకొల్పిన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా క్లిష్టమైన ఆపరేషన్లు సైతం ప్రాంతీయంగా చేయాల్సిన ఆవశ్యకతపై మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టూరి అశోక్‌కుమార్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, చిట్టూరి కలికిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలను యథా స్థానంలో ఏర్పాటు చేయాలి

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు గట్టుపై నాలుగేళ్ల క్రితం తొలగించిన జాతీయ నాయకుల విగ్రహాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భద్రపరిచారని, వాటిని యథా స్థానంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ, ప్రజాసంఘాల నాయకులు కోరారు. స్థానిక బుద్ధ పార్కులో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు దీనిపై చర్చించారు. సమావేశంలో పెన్మత్స జగ్గప్పరాజు, పి.ఉదయ భాస్కరవర్మ, కాశి అచ్యుత రామయ్య, శివప్రసాద్, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుల కల్యాణం

అమలాపురం టౌన్: అమలాపురం మండలం రోళ్లపాలెం కామాక్షీ పీఠం ఆవిర్భవించి 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పీఠంలో శనివారం స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. పీఠాధిపతి కామేశ మహర్షి ఆధ్వర్యంలో కామాక్షీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ తోపెల్ల కార్తీకేయశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల యాజ్ఞికంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. కామాక్షీ రామలింగేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవాన్ని పీఠాధిపతి కామేశ మహర్షి కన్నుల పండువగా నిర్వహించారు. వచ్చే సంవత్సరం పీఠం స్వర్ణోత్సవాలను భారీ స్థాయిలో ర్వహించనున్నామని పీఠాధిపతి ప్రకటించారు.

పోలీసు సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 అమలు

అమలాపురం టౌన్: అమలాపురం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ప్రకటించారు. రానున్న 20 రోజుల పాటు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. సెక్షన్ 30 ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు ఎవరూ నిర్వహించకూడదని డీఎస్పీ వివరించారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అందరూ ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని డీఎస్పీ అంబికా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి బాలయోగి గుడి ప్రాంతానికి చెందిన దాసరి నాగేశ్వరరావు(61) శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్ స్విచ్ కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ముమ్మిడివరం ఇన్‌చార్జ్ ఎస్ఐ సీహెచ్ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

తాళ్లరేవు: ఇంజరం పంచాయతీలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన బాలం రమేష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 6వ తేదీన ఇంజరం గ్రామానికి చెందిన చిట్టిబాబు తన కుమార్తెతో కలిసి యానాం వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నారు. స్థానిక చర్చి సెంటర్‌లో రమేష్ యువతి మెడలోంచి బంగారు గొలుసు తెంపుకుపోతుండగా స్థానికులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై విచారణ నిర్వహించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు కృష్ణా జిల్లా యండవల్లి మండలం మోక్షకలవపూడి గ్రామానికి చెందినవాడుగా గుర్తించారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- ప్రభుత్వాసుపత్రుల్లో ఎంతో మెరుగైన వైద్య సేవలు
- ప్రభుత్వ భరోసాతో నిరుపేదల్లో ఆరోగ్య ధీమా



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

అమలాపురం టౌన్: కోనసీమ వ్యాప్తంగా పేదలకు ఉచిత వైద్యం అందించే అమలాపురంలోని వంద పడకల ప్రభుత్వ పెద్దాసుపత్రి ఏరియా ఆస్పత్రి. ఇక్కడ సేవలు గతంతో పోల్చుకుంటే మరింత విస్తృతం కావడంతో పేదల్లో ఆరోగ్య ధీమా, ధైర్యం మరింత పెరిగింది. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితో పాటు పట్టణంలోని ఉన్న రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడిచే మాతా శిశు సంక్షరణ వైద్యాలయం ఇలా నాలుగు ఆసుపత్రుల్లోను రోజుకు సుమారు 700 మందికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

నాడు తీసికట్టు.. నేడు పైమెట్టు

గత ప్రభుత్వంలో ఆస్పత్రి భవనాలకు మౌలిక వసతులు సరిగా లేక, వైద్యుల పోస్టుల భర్తీ కాక అరకొర వైద్యం అందేది. ఇప్పుడు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అంటే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే స్థాయికి ఎదిగింది. దాదాపు రూ.5.76 కోట్ల నాడు-నేడు నిధులతో ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాలు, పైఅంతస్తు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతున్నాయి. రోగులకు పలు వ్యాధులకు సంబంధించి ఇన్విగేస్టేషన్ టెస్ట్‌లకు క్షణాల్లో ఆధునాతన సాంకేతిక మెషీన్లు కూడా అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యానికి ఆరోగ్యశ్రీ, మౌలిక సదుపాయాలపరంగా పెద్ద పీట వేయడంతో ఈ ఏరియా ఆస్పత్రి గత నాలుగేళ్లలో అనూహ్యమైన



ఏరియా ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం

అభివృద్ధిని సాధించింది.

రోజుకి 600 మంది అవుట్ పేషెంట్లు

ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రోజుకు 3 నుంచి 5 శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా సాధారణ శస్త్ర చికిత్సలు రోజుకు 5 నుంచి 10 వరకూ జరుగుతున్నాయి. రోజుకు ఈ ఆస్పత్రికి 500 నుంచి 600 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. నిత్యం సరాసరిన 70 నుంచి 100 మంది ఇన్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. అన్ని రకాల వైద్య విభాగాలకు వైద్యులు అందుబాటులో ఉండడంతో పాటు రోగులకు అవసరమైన మందులన్నీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుతున్నారు.

అమలాపురంలో ఆస్పత్రుల సమాచారం

1. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి
2. చల్లావారివీధిలో అర్బన్ హెల్త్ సెంటరు-1
3. కచేరి చావిడి భవనంలో అర్బన్ హెల్త్ సెంటరు-2
4. గురిగంట చెరువు వద్ద మాతా శిశు సంరక్షణ వైద్యాలయం

ఏరియా ఆస్పత్రిలో చేసిన ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు

సంవత్సరం	శస్త్ర చికిత్సలు	చెల్లించిన మొత్తం
2019-20	914	రూ.19.86 కోట్లు
2020-21	450	రూ. 7.67 కోట్లు
2021-22	523	రూ.11.25 కోట్లు
2022-23	801	రూ.18.96 కోట్లు
2023-24	127	రూ.2.69 కోట్లు

ప్రభుత్వ వైద్యంతో పురుడు పోసుకున్నాను



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంకు చెందిన మాదే మరియమ్మ.. ఆమె తొలి కాన్పు పురుడు కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చేరి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేశారు. అదే ప్రైవేటు ఆస్పత్రికి వెళితే రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పైగానే ఖర్చయ్యేదని, ప్రభుత్వ ఆస్పత్రిలో పైసా ఖర్చు లేకుండా పురుడు పోయడమే కాకుండా వైద్యులు, నర్సులు తనను బాగా చూసుకున్నారని సంతోషం వ్యక్తం చేస్తుందామె..

ఆరోగ్యశ్రీ నన్ను ఆదుకుంది



నేను నిరుపేద కుటుంబానికి చెందినవాడిని. టైలరింగ్ చేసుకుని బతుకుతున్నాను. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చేరితే ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు.

– కాశి గణేష్, అమలాపురం

అర్బన్ హెల్త్ సెంటర్‌కే వెళతా



నాకు గాని.. మా ఇంట్లో ఎవరికైనా ఎలాంటి సుస్తీ చేసినా ప్రైవేటు ఆస్పత్రులకు పరిగెత్తకుండా ముందు అమలాపురం చల్లావారి వీధిలోని అర్బన్ హెల్త్ సెంటరుకు వెళతాం. ఎందుకంటే గతంలో ప్రభుత్వాసుపత్రులకు ఇప్పుడున్న ప్రభుత్వాసుపత్రులకు ఎంతో తేడా ఉంది. వైద్యులు, సిబ్బంది కూడా బాధ్యతగా పనిచేస్తున్నారు. ఉచిత వైద్య సేవలందిస్తూ అర్బన్ హెల్త్ సెంటరు పేదలకు అందుబాటులో ఉంటోంది.

– తుందూరి సురేష్, రెడ్డిపల్లి, అమలాపురం రూరల్ మండలం

వైద్య సేవలు విస్తృతమయ్యాయి



అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో గత నాలుగేళ్లతో పోల్చితే ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తృతమయ్యాయి. రోజూ ఆరోగ్యశ్రీ ద్వారా అయిదు వరకూ శస్త్ర చికిత్సలు చేస్తుంటే సాధారణ శస్త్ర చికిత్సలు అంతకు మించి చేస్తున్నాం. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది రోగులకు 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం.

– డాక్టర్ కె.శంకరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

కార్పొరేట్ పాఠశాలలను నిరోధించండి

అమలాపురం టౌన్: కార్పొరేట్ పాఠశాలలను నిరోధించి బడ్జెట్ పాఠశాలలకు చేయూతనివ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ నెల 7వ తేదీన మలికిపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను స్వయంగా కలిసి వినతి పత్రం అందించామని అంజిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలు మాయమాటలు చెప్పి ఒక్కో తరగతికి 10 నుంచి 15 సెక్షన్లు పెట్టి విద్యార్థులను తరలించుకుపోతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమస్యను గుర్తించి తమకు న్యాయం చేయాలని అంజిబాబు విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గంజా లక్ష్మిని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం పరామర్శించారు. స్థానిక కేశవపురంలోని ఎంపీటీసీ స్వగృహానికి ఎమ్మెల్యే పొన్నాడ వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మహిళా అధ్యక్షురాలు రేవు మల్లీశ్వరి, దేవస్థానం కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకన్న తదితరులున్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



విఘ్నేశ్వరుని సన్నిధిలో మల్లికార్జునరావు దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి దంపతులకు ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో, వేదా మంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన జడ్జి మల్లికార్జునరావు దంపతులను వేందపండితులు వేదాశీర్వాదం పలికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అలాగే ఆయన్ను స్వామివారి సన్నిధిలో అమలాపురం సివిల్ కోర్టు జడ్జి గౌరీశంకర్, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం

పి.గన్నవరం: మండలంలోని మొండెపులంక శివారు మల్లాయిపాలెంలో ఇంటి పంపకం విషయమై శనివారం అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు. ఇంటి పంపకం విషయమై గుడాల నాగార్జునరావు, గుడాల నాగదుర్గారావుల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. నాగార్జునరావు ఫిర్యాదు మేరకు నలుగురిపై, నాగదుర్గారావు ఫిర్యాదుతో ఒకరిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

లొల్లలో బంగారం, నగదు చోరీ

ఆత్రేయపురం: మండలంలోని లొల్ల గ్రామంలో శనివారం సాయంత్రం చోరీ జరిగినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం లొల్ల గ్రామానికి చెందిన ఉచ్చిలి వెంకటేశ్వరరావు తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు ఈనెల 8న కాపవరం వెళ్లాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి ఇంటిలోకి వెళ్లేటప్పటికీ చోరీ జరిగినట్లు వెంకటేశ్వరరావు గుర్తించాడు. దీంతో ఇంటిలో ఉన్న రూ.4.5 లక్షలు నగదు, 12 కాసుల బంగారం చోరీకి గురైనట్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సంఘటన స్థలానికి రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై సీహెచ్ సుధాకర్‌లు చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా విశాలాక్షి అమ్మవారి తీర్థం



చెముడులంకలో విశాలాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న తమ్మన తదితరులు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో వేంచేసిన విశాలాక్షి దుర్గమ్మ అమ్మవారి తీర్థం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ తీర్థోత్సవాల్లో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెంటపాటి వెంకట్రావు, బుడ్డిగ వీర వెంకట్రావు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీనివాసు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌పై శిక్షణ తరగతులు



సీబీఎస్ఈ సిలబస్ బోధనపై ఓరియంటేషన్ తరగతులకు హాజరైన టీచర్లు

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విద్యా ప్రణాళికను అమలు చేస్తున్న నేపథ్యంలో శనివారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లకు ఒక రోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఇప్పటికే పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1200 మంది గ్రాడ్యుయేట్ టీచర్లు, 150 మంది ప్రిన్సిపల్స్, 600 మంది ఇతర సిబ్బందికి నూతన కరిక్యులమ్‌పై శిక్షణ పూర్తయ్యింది. యానాంలో ఆలస్యంగా ఆదివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం పుదుచ్చేరి డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. సబ్జెక్టుల బోధనా పద్ధతులు, మూల్యాంకనం, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై పుదుచ్చేరిలోని అనుభవజ్ఞులైన ప్రిన్సిపాల్, టీచర్ల ద్వారా శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల పక్షాన సీఎం వైఎస్ జగన్



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

అల్లవరం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో జీపీఎస్ ఏర్పాటు చేసి సీఎం వైఎస్ జగన్ ఉద్యోగుల పక్షాన నిలిచారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. జగ్జీవన్‌రామ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ జులై నుంచి డీఏ విడుదల చేశారని, ఈ ఏడాదిలో కొత్త పీఆర్సీ కమిషన్ త్వరలో ఏర్పాటుచేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఉద్యోగులకు అన్ని విధాలా ప్రయోజనాలు సీఎం జగన్‌తోనే సాధ్యమని తెలిపారు. అనంతరం ఇజ్రాయిల్‌ను యూనియన్ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు, కముజు చంద్రరావు, ఉందుర్తి సతీష్, ఉందుర్తి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలావధాని భరత్‌శర్మ అష్టావధానం



బాల అష్టావధాని భరత్ శర్మ నిర్వహిస్తున్న అష్టావధానం

అమలాపురం టౌన్: అమలాపురం యర్రమిల్లివారి వీధిలోని సకల కార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర్‌లో తిరుపతికి చెందిన 17 ఏళ్ల బాలావధాని ఉప్పలధడియం భరత్‌శర్మ శనివారం సాయంత్రం చేసిన అష్టావధానం సభికులను అలరించింది. పృచ్ఛకులు అడిగిన క్లిష్టమైన ప్రశ్నలను బాల అవధాని అలవోకగా పూరించి ఔరా అనిపించారు. సాహితీ వేత్త బ్రహ్మశ్రీ తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ నిర్వహణలో శతావధాని జాన దుర్గా మల్లికార్జునరావు ఈ అవధానానికి సంచాలకులుగా వ్యవహరించారు. నిషిద్ధాక్షరిగా కన్నేపల్లి వరలక్ష్మి, సమస్యగా ఆకొండి ధన్వంతరి, దత్తపదిగా గొలకోటి శ్రీనివాస్, న్యస్తాక్షరిగా ఆకుండి శైలజ, వర్ణనగా డాక్టర్ ప్రభల రామలక్ష్మి, ఛందోభాషణంగా ఓలేటి బంగారేశ్వర శర్మ, ఆశువుగా నండూరి జయలక్ష్మి, అప్రస్తుత ప్రసంగం కొరుప్రోలు గౌరీ నాయుడు పృచ్ఛకులుగా వ్యవహరించారు. బాల అష్టావధాని భరత్‌శర్మ కోనసీమ కొబ్బరి గురించి అలవోకగా చెప్పిన 'నారికేళం గుప్తసార మనోజ్ఞమై' అనే పద్యం అందరినీ అలరించింది. ఓ పృచ్ఛకుడు 'ద్రౌపదికి, సీతకు పోలిక ఏమిటి..? అని ప్రశ్నించగా ఇద్దరూ అయోనిజలు, ఇద్దరూ వనవాసం చేశారని అవధాని తక్కున సమాధానం ఇచ్చారు. ఇలా ప్రశ్నలు. పూరింపులతో అష్టావధానం చమత్కారాలు, భావ గర్భితాలు, హాస్యోక్తులలో అటు సాహితీ పరిమళాలు వెదజల్లుతూ... ఇటు అష్టవధాన కీర్తిని చాటుతూ సాగింది. జిల్లా సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, రచయిత పుత్సా కృష్ణ కామేశ్వర్, వేదనభట్ల సాయిలక్ష్మి, కేవీ ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మరో రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావాలని బీజేపీ ప్రయత్నిస్తుందని విముక్త చిరుతల కక్ష(వీసీకే) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్ అన్నారు. అమలాపురం కొంకాపల్లి ఎత్తురోడ్డు వద్ద సత్తెమ్మ తల్లి లేఅవుట్‌లో వీసీకే పార్టీ ఆధ్వర్యంలో స్వయం పాలన సంకల్ప సభ శనివారం రాత్రి నిర్వహించారు.

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రజా గాయకుడు గద్దర్ హాజరై విప్లవ గీతాలు ఆలపించారు. సమావేశంలో డాక్టర్ తిరుమావళవన్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు నెరవేరాలంటే పరాయి పాలన అంతమై స్వయం పాలన కావాలని అది వీసీకే పార్టీతోనే సాధ్యమన్నారు. వీసీకే వార్షిక అవార్డులను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్, వాగ్గేయకారుడు తెలంగాణ కవి గోరటి వెంకన్నలకు ప్రధానం చేశారు. సమావేశంలో వీసీకే పార్టీ తెలంగాణ అధ్యక్షుడు వి.శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు బొంతురమణ, డీబీలోక్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఆరు కేసులకు పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో లబ్ధిదారులకు చెల్లిస్తున్న సొమ్ము

యానాం: స్థానిక యానాం సబ్‌కోర్టులో శనివారం జరిగిన మెగా నేషనల్ లోక్‌అదాలత్ ద్వారా ఆరు కేసులు పరిష్కరించి వాటి నిమిత్తం రూ.24,65,000 మొత్తాన్ని ఆయా కక్ష్యదారులకు అందజేశారు. యానాం సబ్‌కోర్టు జడ్జి రాజ్‌మోహన్ నేషనల్ లోక్ అదాలత్ చైర్మన్‌గా వ్యవహరించారు. న్యాయవాదులు పేర్ని ఆదినారాయణమూర్తి, ఇంధన రామకృష్ణలను ప్యానల్ మెంబర్లుగా నియమించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ సలాది దుర్గాశ్రీనివాస్, న్యాయవాదులు కమిడి విజయ్‌కుమార్, ఎస్ఎస్ఎన్ రాజు, గెద్దం ఈశ్వరరావు, భ్రమరాంబిక, నామాడి స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18 కేసుల్లో జరిమానా విధింపు

యానాం: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా శనివారం స్థానిక సబ్‌కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో సబ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాలు, బహిరంగంగా మద్యం తాగడం తదితర 18 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా సదరు 18 కేసులకు సంబంధించి 21 మందికి రూ.10,550 జరిమానా విధించారన్నారు.

పోటీ ఆధారిత బోధన అవసరం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రకాశరావు

యానాం: 21వ శతాబ్దపు విద్యా నైపుణ్యాల్లో విద్యార్థులను తీర్చిదిద్దేలా నాణ్యమైన, పోటీ ఆధారిత బోధన చేయాల్సిన ఆవశ్యకత ఉందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మెట్టకూరు నవోదయ విద్యాలయలో జి-20 దేశాలకు భారతదేశం నాయకత్వం వహించడం నేపథ్యంలో నూతన విద్యావిధానంలోని ప్రధాన అంశాలైన అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం తదితర అంశాలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపుకు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అధ్యక్షతన వహించి మట్లాడుతూ జి-20 దేశాల సమాఖ్యకు భారతదేశం సారథ్యం వహించడం అపూర్వమైన విషయమన్నారు. వర్క్‌షాప్‌లో వివిధ పాఠశాలల నుంచి 90 మంది టీచర్లు పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ పోలీసులకు వాటర్ డిస్పెన్సరీలు బహూకరణ



వాటర్ డిస్పెన్సరీలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయానికి ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ రెండు వాటర్ డిస్పెన్సరీలను సమకూర్చింది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ వాటర్ డిస్పెన్సరీలను శనివారం ప్రారంభించారు. పోలీసుల ప్రయోజనాల కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న సేవలను ఎస్పీ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ పి.పార్థసారథి, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, చాంబర్ గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, వ్యవస్థాప అధ్యక్షుడు గోకరకొండ హరిబాబు, ఉపాధ్యక్షుడు చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల ఆధునీకరణకు ప్రాధాన్యత



అసంపూర్తిగా ఉన్న డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలో కొన్నేళ్ల క్రితం వేసిన డ్రెయినేజీల స్థానంలో ఆధునిక డ్రెయినేజీల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పిల్లారాయ దేవాలయ ప్రాంగణం నుంచి యానాం పోలీస్‌స్టేషన్ మీదుగా నిర్మాణం జరిగిన డ్రెయిన్ అస్తవ్యస్తంగా ఉందంటూ ఎమ్మెల్యే అశోక్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజాపనుల శాఖ నిధులుతో నిర్మించిన నూతన డ్రెయిన్లపై ఇనుప గ్రిల్స్ వేయకపోవడంపై అధికారులను ఆయన ప్రశ్నించారు. పది రోజుల్లో డ్రెయిన్‌పై ఇనుప గ్రిల్స్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ వీరసెల్వం, జేఈ నాగరాజు, సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలు, డ్రైన్లు వెంటనే బాగుచేయాలి

కొత్తపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో సాగునీరుకు అడ్డంకులు ఏర్పడకుండా పంట కాలువలు (చానల్స్) డ్రైన్లలో తూటు, తుక్కు, వ్యర్థాలు తొలగింపుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అంశాలు, ఖరీఫ్ సాగుపై సమీక్షించారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా యంత్ర పరికరాలు గ్రూపులుగా చూస్తున్నారని, వాటిని రైతులకు వ్యక్తిగతంగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు డీసీసీబీ ద్వారా రుణాలు ఇవ్వాలని, ప్రతి రైతుకు రూ.30 వేలు రెండు దఫాలుగా ఇవ్వాలని కోరారు. ఏడీఏ వెంకటరామారావు మాట్లాడుతూ మండలానికి పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్స్ 3 మంజూరు కాగా ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు ఏ రకాలు కావాలో రైతులు తెలియజేస్తే ఆయా రకాలను ఆర్‌బీకేలకు దిగుమతి చేసే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 60 మెట్రిక్ టన్నుల ఎరువుల టార్గెట్ ఇచ్చామని, ఎరువుల కొరత లేకుండా ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.